## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

వలిగొండ, నవంబర్ 2 : విద్యార్థులకు శుభ్రమైన, నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి అన్నారు. మండలంలోని లోతుకుంట గ్రామంలోని కేజీబీవీ పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అందిస్తున్న వంటకాలతోపాటు కిచెన్, కూరగాయలు, నిల్వ చేసిన కిరాణా సామగ్రి, పాఠశాలలో పారిశుధ్యం, విద్యార్థుల ఆరోగ్య రక్షణ కోసం అందించే మందులను పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న హెల్త్ అసిస్టెంట్‌కు మెమో ఇవ్వాలని స్కూల్ ప్రిన్సిపాల్‌కు సూచించారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకొని విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఎంపీఓ కేదారీశ్వర్, ఎంఈఓ సుంకోజు భాస్కర్, ఆలకుంట్ల శ్రీనివాస్, కేజీబీవీ ప్రిన్సిపాల్ దుర్గ పాల్గొన్నారు.

## పిల్లలందరికీ క్రమం తప్పకుండా టీకాలు వేయాలి

- జిల్లా వ్యాధి నివారణ టీకాల అధికారి రామకృష్ణ

టీకాలను పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ రామకృష్ణ

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 2 : పిల్లలందరికీ క్రమం తప్పకుండా టీకాలు వేయాలని జిల్లా వ్యాధి నివారణ టీకాల అధికారి (డీఐఓ) డాక్టర్ రామకృష్ణ అన్నారు. మున్సిపాలిటీలోని గాంధీనగర్, రాంనగర్, నారాయణగిరి కేంద్రాల్లో జరిగే యూనివర్సల్ ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్లె దవఖాన వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాలు ఇచ్చిన తర్వాత ఫాలో అప్ చేయాలన్నారు. వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోతారెడ్డి, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, శ్రీదేవి, పల్లె దవాఖాన డాక్టర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఫార్మాసిస్ట్ ఆఫీసర్ ప్రదీప్, నర్సింగ్, కృష్ణవేణి, పద్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- జిల్లా తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

వేయింగ్ మిషన్‌కు సీల్ వేస్తున్న జిల్లా తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ వెంటేశ్వర్లు

బొమ్మలరామారం, నవంబర్ 2 : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం విషయంలో రైతులను ఇబ్బంది పెట్టొద్దని జిల్లా తునికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ కందగట్ల వెంకటేశ్వర్లు అన్నారు. బొమ్మలరామారం, నాగినేనిపల్లి, హాజీపూర్, మర్యాల గ్రామాల్లో శనివారం కొనుగోలు కేంద్రాల్లో వేయింగ్ మిషన్ల పనితీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూనికలు, కొలతల అధికారులు సర్టిఫై చేసిన వేయింగ్ మిషన్లు మాత్రమే వినియోగించాలన్నారు. రైస్ మిల్లర్లు తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అనంతరం పీఏసీఎస్ కార్యాలయాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు నమోదు రిజిష్టర్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖానల్లో నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

- జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి మనోహర్

రోగులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 2 : పల్లె దవాఖానల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. మండలంలోని బొల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అనాజిపురం పల్లె దవాఖానను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. ఈ సందర్భంగా పల్లె దవఖానాలో అందిస్తున్న 12 రకాల ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలపై ఆరా తీశారు. పల్లె దవాఖానలో పూర్తిస్థాయి వైద్య సేవలు అందించేలా విధులు నిర్వర్తించాలని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ విజయకు సూచించారు. అనంతరం బీపీ, షుగర్ రోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలు వినియోగించుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ శిల్పిని

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ శిల్పిని

మోటకొండూర్, నవంబర్ 2 : మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వారంలో మూడు నుంచి నాలుగు రోజుల పాటు నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటారని, వారి సేవలను మండల ప్రజలు వినియోగించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ శిల్పిని అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో 12రకాల స్పెషలిస్ట్ ఔట్ పేషెంట్ సేవలను జనరల్ మెడిసిన్ సివిల్ సర్జన్ శ్రీనివాస్‌తో కలిసి శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీలో అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి విజయ్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలి : ఏడీఏ

ఆయిల్ పామ్ నర్సరీని పరిశీలిస్తున్న ఏడీఏ పద్మావతి

మోత్కూరు, నవంబర్ 2 : ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని ఆలేరు ఏడీఏ డి.పద్మావతి అన్నారు. మండలంలోని పాలడుగులో ఆయిల్ పామ్ నర్సరీని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేసే రైతుల కోసం నర్సరీలో మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. పామాయిల్ సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను పొందే అవకాశం ఉన్నదని తెలిపారు. మొక్కలు నాటిన 4ఏండ్ల తర్వాత పంట చేతికి వస్తుందని, చీడపీడల బెడద ఉండదని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు గ్రామాల్లో క్షేత్ర విస్తరణాధికారులకు తమ వివరాలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ వి.కీర్తి, ఏఈఓలు టి.గోపీనాథ్, ఎం.అశోక్, ఎ.వేణు, ఆయిల్ ఫామ్ క్షేత్ర అధికారి బి.మమత, నర్సరీ ఇన్‌చార్జి పురుషోత్తం, మధు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో కార్తీక వ్రత పూజలు


యాదగిరిగుట్టలో సత్యనారాయణ వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట, నవంబర్ 2 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంతో పాటు పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం కార్తీక మాస వేడుకలు విశేషంగా ప్రారంభమయ్యాయి. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు వేకువజామునే కొండపైన దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ కింద సత్యనారాయణ స్వామి వ్రత మండపం భక్తులతో సందడిగా మారింది. తొలి రోజు 498 జంటలు వ్రతమాచరించి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం చేపట్టి భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పించారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన అత్యంత వైభవంగా జరిగింది. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతును జరిపారు. సాయంత్రం స్వామివారికి వెండి మొక్కు జోడు సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. కార్తీక మాసం తొలిరోజు కావడంతో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.42,25,956 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. కొండపైన సాంస్కృతిక మండపంలో హనుమకొండకు చెందిన శ్రీనృత్య స్రవంతి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వారు కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు.

## విమానగోపురం స్వర్ణ తాపడానికి రూ.2లక్షల విరాళం

ఆలయ ఈఓ భాస్కర్‌రావుకు చెక్కు అందజేస్తున్న సునీతావామనరావు దంపతులు

యాదగిరిగుట్ట, నవంబర్ 2 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం దివ్య విమానగోపురం స్వర్ణతాపడానికి దాతల నుంచి విరాళాల సేకరణ కొనసాగుతున్నది. హైదరాబాద్‌లోని మారేడ్‌పల్లికి చెందిన వెలుగుపల్లి సునీత, వామనరావు దంపతులు రూ.1,00,001, ఉప్పల్‌కు చెందిన మేడిశెట్టి స్రవంతి, మాణిక్‌ప్రభు దంపతులు లక్ష రూపాయల విరాళం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన చెక్కులను శనివారం ఆలయ ఈఓ కార్యాలయంలో కార్యనిర్వహణాధికారి భాస్కర్‌రావుకు వేర్వేరుగా అందజేశారు. కార్యక్రమంలో ఉప ప్రధానార్చకుడు మాధవాచార్యులు ఉన్నారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల సమావేశం

చౌటుప్పల్, నవంబర్ 2 : పట్టణంలోని జయశ్రీ గార్డెన్‌లో ఆదివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జాతీయ విద్యుత్ వినియోగదారుల దినోత్సవ సమావేశం నిర్వహిస్తున్నట్లు చౌటుప్పల్ డివిజనల్ ఇంజినీర్ డీఎస్ మల్లికార్జున్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని చౌటుప్పల్, భూదాన్ పోచంపల్లి, సంస్థాన్ నారాయణపూర్ మండలాల వినియోగదారులు ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా చౌటుప్పల్ తంగడపల్లి పక్కన ఉన్న ఏఈ కార్యాలయంలో వినతులు ఇవ్వాలని సూచించారు. రామన్నపేట, వలిగొండ మండలాల వినియోగదారులు రామన్నపేట విద్యుత్ ఆఫీస్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మోత్కూరు : విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో ఆదివారం వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం ఆవరణలో మధ్యాహ్నం 12గంటలకు జరుగనున్న సమావేశానికి వినియోగదారులు హాజరై సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం పొందాలని సూచించారు.

## రోడ్డు సర్వే చేయాలని వినతి

చౌటుప్పల్, నవంబర్ 2 : మండలంలోని లింగోజిగూడెం నుంచి ఎస్.లింగోటం వెళ్లే రహదారిని ఇరువైపులా సర్వే చేయించి హద్దురాళ్లు నాటాలని తాసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ బాణాల రాంరెడ్డికి లింగోజిగూడెం గ్రామస్తులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ రోడ్డు అక్రమణకు గురికాకుండా చూడాలని వారు కోరారు. తక్షణమే ప్రభుత్వ సర్వేయర్‌తో సర్వే చేయించాలని వినతిలో పేర్కొన్నారు.

## చెరువుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు

ఆత్మకూరు(ఎం), నవంబర్ 2 : మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లోని చెరువులు, కుంటల వద్ద పోలీసులు శనివారం ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరుగుతున్నందున యువకులు, పిల్లలు చెరువులు, కుంటల్లో ఈతకు, చేపల వేటకు వెళ్లొద్దని సీఐ సోలోమాన్‌రాజ్ సూచించారు.

వీర్ల చెరువు వద్ద ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్న పోలీసులు

## గ్రామాల్లో ఎన్ఎల్ఎం బృందం పర్యటన

అభివృద్ధి పనులపై వివరిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 2 : మండలంలోని బొల్లేపల్లి, ఎర్రంబల్లి గ్రామాల్లో నేషనల్ లెవల్ మానిటరింగ్ బృందం సభ్యులు ఎస్.అర్జున్, సుహైబ్ శనివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులు, వాటి రికార్డులు, ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో చేపట్టిన రోడ్లను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలు, పింఛన్‌దారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావు, ఎంపీఓ ఎం.దినకర్‌గౌడ్, పీఆర్ ఏఈ, ప్రసాద్, ఏపీఓ బాలస్వామి, ప్లాంటేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ ఇనాయత్ అలీ, పంచాయతీ కార్యదర్శులు పద్మారెడ్డి, హేమలత, ఏపీఎం అంజయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వంగపల్లిలో పన్నీరు తయారీ కేంద్రంపై ఎస్ఓటీ దాడి

ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్న పన్నీరు

యాదగిరిగుట్ట, నవంబర్ 2 : మండలంలోని వంగపల్లి గ్రామంలో అనుమతి లేకుండా నడిపిస్తున్న పన్నీరు తయారీ కేంద్రంపై భువనగిరి జోన్ ఎస్ఓటీ బృందం సభ్యులు శుక్రవారం దాడులు నిర్వహించగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిర్వాహకుడు మున్నూమియాను అదుపులోకి తీసుకుని విచారించారు. ఫుడ్ ట్రేడ్ లైసెన్స్, ట్రేట్ లైసెన్స్ లేకుండా అపరిశుభ్ర వాతావరణంలో పెద్ద ఎత్తున పన్నీరు తయారు చేస్తున్నాడు. దాన్ని సికింద్రాబాద్‌లోని పికెట్‌లో ఉండే పన్నీరు డీలర్ ఉదయ్ ద్వారా మారేడ్‌పల్లి, అల్వాల్ ప్రాంతాల్లో సంతోష్ దాబా, కార్ఖానాలోని శాంతి దాబాతోపాటు ఇతర హోటల్‌కు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని ఎస్ఓటీ పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి 120 కిలోల పన్నీరు స్వాధీనం చేసుకుని యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు చెప్పారు. లైసెన్స్ లేని తయారీ కేంద్రాల వద్ద ముడి సరుకులు కొనుగోలు చేయవద్దని హోటల్ యజమానులకు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అపరిశుభ్ర తయారీ కేంద్రాల వివరాలను పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## మాజీ సర్పంచుల పోరుబాటను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్ ముదిరాజ్

మోత్కూరు, నవంబర్ 2 : పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఈ నెల 4న నిర్వహించనున్న పోరుబాటను విజయవంతం చేయాలని తాజా మాజీ సర్పంచుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య కోరారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి, పథకాల అమలు కోసం సర్పంచులు అప్పులు చేసి పెట్టుబడి పెట్టారన్నారు. బకాయిలు చెల్లించాలని ఎంతో కాలంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా సోమవారం నిర్వహించతలపెట్టిన పోరుబాట కార్యక్రమానికి తాజా మాజీ సర్పంచులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**'సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి'**

బొమ్మలరామారం : గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మేడబోయిన గణేశ్ ముదిరాజ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన మాజీ సర్పంచుల మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచుల పదవి కాలం ముగిసి సంవత్సరం అవుతున్నా చేసిన గ్రామ పంచాయతీ అభివృద్ధి బిల్లులు చెల్లించడం లేదన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4న చలో హైదరాబాద్ పోరుబాట కార్యక్రమానికి తాజీ మాజీ సర్పంచులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచులు భట్కీర్ బీరప్ప, నోముల రాంరెడ్డి, ధీరావత్ పాండునాయక్, ధీరావత్ శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుపై అపోహలు నమ్మొద్దు : ఏఓ

దాతారుపల్లిలో ధాన్యం తేమ పరిశీలిస్తున్న ఏఓ సుధారాణి

యాదగిరిగుట్ట, నవంబర్ 2 : వరి ధాన్యం కొనుగోలుపై అపోహలు నమ్మొద్దని, 17శాతం కంటే తేమ తక్కువ ఉన్న ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తామని ఏఓ సుధారాణి అన్నారు. మండలంలోని దాతారుపల్లి, రాళ్ల జనగాం గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడిసిందని, దీంతో తేమ శాతం ఎక్కువ ఉంటుందని అన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఏఈఓ విరన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సర్వే చేయాలి : ఎంఈఓ

రాయిపల్లిలో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రాజారాం

ఆత్మకూరు(ఎం), నవంబర్ 2 : మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికీ ఎన్యూమరేటర్లు వెళ్లి కుటుంబ సర్వే చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి రాజారాం అన్నారు. మండలంలోని రాయిపల్లిలో శనివారం చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాములునాయక్, పంచాయతీ కార్యదర్శి బాలరాజు, కారోబార్ రామనర్సయ్య పాల్గొన్నారు.

బీసీ కులగణన సర్వే అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

## పార్టీలకు అతీతంగా సర్వేకు సహకరించాలి

- ప్రభుత్వ విప్ ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

ఆలేరు టౌన్ , నవంబర్ 2 : ఇంటింటి సర్వేకు పార్టీలకు అతీతంగా సహకరించి విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆలేరులోని వైఎస్ఎన్ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన కుటుంబ సర్వే అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలుకు కుటుంబ సర్వే ప్రామాణికం కానుందని, ప్రజలందరూ సహకరించాలని అన్నారు. బీసీ కులగణన ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కేటాయిస్తారని తెలిపారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ కులగణన ద్వారానే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటింటి సర్వేకు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కులగణన సమగ్ర సర్వే వల్ల అన్ని కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్యారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈసారపు యాదగిరి గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు టౌన్, నవంబర్ 2 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆలేరు జడ్పీహెచ్ఎస్ క్రీడా ప్రాంగణంలో ఆలేటి బాలమ్మ, మల్లయ్య జ్ఞాపకార్థం శనివారం ఏర్పాటు నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్ 14, 17 బాలబాలికల ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి బహుమతులు గెలుచుకోవాలన్నారు అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకుముందు క్రీడా పోటీలను మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఏసీపీ రమేశ్‌కుమార్, సీఐ కొండల్‌రావు, ఎస్ఐ రజనీకర్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, నీలం పద్మావెంకటస్వామి, ప్రధానోపాధ్యాయురాలు మంజుల, బెజ్జం బాలకృష్ణ, పీఈటీలు పూల నాగయ్య, మధు, జోసెఫ్, అనిత, బాలరాజు, సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

బస్తాను తూకం వేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అడ్డగూడూరు, నవంబర్ 2 : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల కేంద్రంతోపాటు ధర్మారం, డి.రేపాక, చౌళ్ల రామారం, కోటమర్తి గ్రామాల్లో ఐకేపీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులు తగిన తేమ శాతంతో దుమ్ము, ధూళి లేకుండా శుభ్రం చేసి నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని సూచించారు. దళారుల మాటలు నమ్మి వారికి విక్రయించి మోసపోవద్దని కోరారు. అడ్డగూడూరుకు త్వరలో ఐటీఐ కాలేజీ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. బునాదిగాని కాల్వ నిర్మాణానికి రూ.266 కోట్లు మంజూరయ్యాయన్నారు. బిక్కేరు వాగులోకి గోదావరి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మావతి, ఏపీడీ శ్రీనివాస్, డీపీఎం సునీల్‌రెడ్డి, ఎంపీడీఓ శంకరయ్య, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఏఓ పాండురంగాచారి, సింగిల్‌విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ చేడె చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పోలెబోయిన లింగయ్యయాదవ్, నాయకులు పాశం సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఇంద్రపాలనగరం చెరువు పరిశీలన

ఇంద్రపాలనగరం చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, అక్టోబర్ 2 : మండలంలోని ఇంద్రపాలనగరం చెరువు, మూసీ కాల్వను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న మూసీ శుద్ధీకరణతో ఈ ప్రాంత ప్రజల బాధలు తీరుతాయన్నారు. రాజకీయాలకు అతీతంగా మూసీ ప్రక్షాళనలో భాగస్వాములు కావాలని కోరారు. ఆయన వెంట నాయకులు బాలకిషన్, వెంకటేశ్, ఆంజనేయులు, సురేశ్, గోపాల్‌రెడ్డి, జానీ, గోపాల్, స్వామి, ప్రభాకర్, నర్సింహ ఉన్నారు.

## పలువురి కుటుంబాలకు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి పరామర్శ

వలిగొండ, నవంబర్ 2 : మండల కేంద్రంలో శుక్రవారం మూసీ నదిలో పడి మృతిచెందిన విద్యార్థులు కళ్ల